నవతెలంగాణ
ఆదిలాబాద్
1
ఆదివారం | ఫిబ్రవరి 02, 2025 | www.navatelangana.com

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ చేపడుతున్నామని జైనూర్ సీఐ రమేష్ తెలిపారు. శనివారం జైనూర్ మండల కేంద్రంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూర్ మండల కేంద్రంలోని పలు కాలనిల్లో ఇంటింటికీ తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 46 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, నేరాల నియంత్రణకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో జిల్లాలోని ఇద్దరు సీఐలు, 6గురు ఎస్సైలతో పాటు 67 మంది సిబ్బందితో తనిఖీలు చేశామన్నారు.



ఫెయిల్ అవుతాననే భయంతో బాలిక ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్

పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో మనస్థాపానికి గురై బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం రాంనగర్‌కు చెందిన చిలువేరు యోగిత(16) తల్లిదండ్రులు ఉద్యోగ రీత్యా ఆంధ్రాలో నివాసం ఉంటున్నారు. రాంనగర్‌లోని అమ్మమ్మ కొమరమ్మ దగ్గర ఉండి నస్పూర్‌లోని ఓ ప్రయివేట్ పాఠశాలలో చదువుకుంటోంది. మార్చిలో జరగనున్న పదవ తరగతి ఆఖరు పరీక్షల్లో ఫెయిల్ అవుతానని భయంతో శనివారం ఉదయం వంటింట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.



జిల్లాకు మొండిచేయి..!

- కేంద్ర బడ్జెట్‌లో కనిపించని ఉమ్మడి జిల్లా ప్రస్తావన
- కలగానే మారనున్న సీసీఐ పునరుద్ధరణ
- ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ ఊసేలేదు
- మరోసారి నిరాశ పర్చిన నిర్మలమ్మ పద్దు

కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు మరోసారి మొండి చేయి కనిపించింది. అనేక ఏండ్లుగా జిల్లావాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎలాంటి భరోసా దక్కలేదు. జిల్లా ప్రజల ఆకాంక్ష అయిన సిమెంటు పరిశ్రమ పునరుద్ధరణ కలగానే మారనుంది. ఇక ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వే లైన్ మంజూరుపై ఎలాంటి ప్రకటన లేకపోవడంతో కేంద్ర పద్దుపై తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది. కనీసం కొత్తగా నవోదయ పాఠశాలలైన మంజూరవుతాయని భావించినా బడ్జెట్‌లో వీటి ప్రస్తావన కనిపించడం లేదు. రూ.12లక్షల వరకు ఆదాయం కలిగిన వారికి పన్ను రద్దు చేస్తామని చెప్పడంతో వేతన జీవులకు కొంత ఊరట లభించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ బడుల్లో బ్రాడ్‌బ్యాండ్ సేవలు, టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు, జాతీయ స్థాయిలో పత్తి కమీషన్ ఏర్పాటుచేస్తామని చెప్పడంతో దీని ద్వారానైనా జిల్లా రైతులకు ప్రయోజనం ఉంటుందని ఆశిస్తున్నారు. మరోపక్క ఉడాన్ పథకం కింద మంజూరైన విమానశ్రయాల్లో ఆదిలాబాద్ జిల్లా పేరు జాబితాలో ఉన్నదా లేదా అనేది సందిగ్ధంగా మారింది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం శనివారం 2025-26 వార్షిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ పద్దులో ఉమ్మడి జిల్లాకు చెప్పుకోదగిన ప్రయోజనాలు దక్కలేదు. దీంతో ఈ బడ్జెట్‌లో అనేక ఆశలు పెట్టుకున్న ఉమ్మడి జిల్లావాసులు తీవ్ర నిరాశకు గురయ్యారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు పట్టాలెక్కుతాయని భావించినా ఫలితం కనిపించలేదు. కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురి చేసిందని ప్రతిపక్షాలు, వామపక్ష పార్టీలతో పాటు పలువురు మేధావులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏండ్లుగా మూతపడిన సిమెంటు పరిశ్రమను తెరిపించాలని అనేక ఏండ్లుగా డిమాండ్ వినిపిస్తోంది. బీజేపీకి చెందిన ప్రజాప్రతినిధులు సైతం ఈ పరిశ్రమ పునరుద్ధరణకు కృషిచేస్తామని గతంలో హామీనిచ్చారు. ఈ పరిశ్రమ ప్రారంభమైతే జిల్లా రూపురేఖలు మారడంతో పాటు వేలాది మందికి ఉపాధి లభిస్తుందని సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నారు. తాజా బడ్జెట్‌లో ఈ పరిశ్రమకు సంబంధించి ఏదైనా ఉపయోగం ఉంటుందని అందరూ భావించారు. కానీ ప్రభుత్వం బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన తీసుకురాకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో గతంలో ఎన్నడూలేని విధంగా ఇక్కడి జనాలు రెండు సార్లు బీజేపీ ఎంపీ సీటును గెలిపించడంతో పాటు నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించినా కేంద్రం జిల్లా అభివృద్ధిని పట్టించుకోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కనిపించని రైల్వేలైన్ ప్రస్తావన..!

ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు రైల్వే సేవలు ఉన్నా..ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు మాత్రం సేవలు అంతగా లేవు. ఆదిలాబాద్ - ఆర్మూర్ లైన్ వేస్తే ఈ రెండు ప్రాంతాలకు చెందిన వారు హైదరాబాద్‌కు వెళ్లేందుకు మార్గం సుగుమమవుతుంది. దూరభారం తగ్గిపోవడంతో వస్తు రవాణా వ్యవస్థ కూడా మెరుగుపడుతుంది. ఈ లైన్‌కు సంబంధించి సర్వే చేసినప్పటికీ నిధులు విడుదల చేయకపోవడం మూలంగా పనులు ప్రారంభం కావడం లేదు. ఇక్కడి ప్రజలు అనేక ఏండ్లుగా ఈ రైల్వేలైన్‌కు నిధులు విడుదల చేయాలని కోరుతున్నా కేంద్రం పెడచెవిన పెడుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంచిర్యాల, కుమురంభీం జిల్లాలో చేపడుతున్న కొన్ని రైల్వే వంతెనలకు సైతం నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. మరోపక్క ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానశ్రయ నిర్మాణానికి అన్ని అనుకూలతలు ఉన్నాయి. ఇక్కడ అవసరమైన భూమి కూడా సిద్ధంగా ఉండగా.. పలుమార్లు ఏవియేషన్ అధికారులు ఇక్కడకు వచ్చి సర్వేలు నిర్వహించారు. తాజాగా కేంద్రం ఉడాన్ పథకంలో భాగంగా 120 విమానశ్రయాలను నిర్మిస్తామని చెప్పింది. కానీ ఈ జాబితాలో ఆదిలాబాద్ జిల్లా ప్రస్తావన ఉందా లేదా అనేది అనుమానంగా మారుతోంది. మరోపక్క టెక్స్‌టైల్ పార్కు, గిరిజన యూనివర్సిటీకి సంబంధించి ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఉమ్మడి జిల్లావాసుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది.

రైతుల సంక్షేమాన్ని విస్మరించింది : జోగు రామన్న మాజీ మంత్రి



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, టెక్స్‌టైల్ పార్కు, ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్, గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించలేదు. కేంద్రం మరోసారి అంకెల గారడికి తెరలేపింది. సీసీఐని పరిశ్రమను తెరిపిస్తామని గత ఎన్నికల్లో కేంద్ర మంత్రి అమిత్‌షా, ఎమ్మెల్యే పాయల్‌శంకర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి.



జిల్లాకు మరోసారి మొండిచేయి : దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

కేంద్రం ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లాకు మరోసారి మొండి చేయి చూపించింది. జిల్లాకు చిల్లిగవ్వ కూడా కేటాయించకపోవడం చూస్తుంటే బీజేపీ చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతోంది. గత ఎన్నికల్లో సీసీఐ పరిశ్రమను తెరిపిస్తామని కేంద్ర హోమంత్రి అమిత్‌షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ హామీనిచ్చినా నిలబెట్టుకోలేదు. ఎంపీ, నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించినా ఉమ్మడి జిల్లా ప్రజలను అవమానపర్చింది.

దేశ అభివృద్ధిని బలహీనపరిచేలా కేంద్ర బడ్జెట్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

దేశ అభివృద్ధిని బలహీనపరిచే విధంగా కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 ఆర్థిక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బడ్జెట్ పత్రాలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో 77 కోట్ల మంది వ్యవసాయ రంగంలో ఉన్నప్పటికీ కనీస మద్దతు ధర హామీ పదేళ్లుగా అమలు చేయలేదన్నారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు పెంచలేదన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందు పై సబ్సిడీలో భారీగా కోతలు విధించారన్నారు. 60 వేల కోట్ల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయం ద్వారా ఆదాయం సమర్పించుకోవడం ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేయడమేనన్నారు. కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారుల రూ. 2 లక్షల 14 వేల కోట్ల బకాయిలను మాఫీ చేసి ప్రభుత్వ రంగం బ్యాంకులను బలహీనపరుస్తుందన్నారు. ప్రస్తుత కాలంలో శ్రామికుల నిజ వేతనాలు 20 శాతం తగ్గి నిత్యావసర సరుకులు 30 నుండి 50 శాతం పెరుగుతున్నాయన్నారు. పేదల వాస్తవ ఆదాయం 11 శాతానికి పడిపోగా బడా కార్పొరేట్ల ఆదాయం ఘనంగా 30 శాతం కంటే ఎక్కువ పెరిగిందని దీన్ని ముక్తకంఠంతో కార్మిక వర్గం బడ్జెట్‌ను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల దృష్టిలో పెట్టుకొని బీహార్‌కి వరాలు తెలంగాణకి మొండి చేయి చూపెట్టిన పరిస్థితి ఈ బడ్జెట్‌తో తేటతెల్లమయిందన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26వేల పెంచాలన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులలో రోజు కూలీ రూ. 600 తో సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మాపురం ముత్తన్న, సీఐటీయూ జిల్లా నాయకులు డిపోశెట్టి, వ్యవసాయ కార్మిక సంఘం నిర్మల్ మండల్ అధ్యక్షుడు బర్కుంట గంగారం, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష ఎన్నికకు బీజేపీలో పోటాపోటీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేపీ జిల్లా అధ్యక్షుని పదవీ కాలం ముగియడంతో నూతన అధ్యక్షుని ఎన్నికకు కసరత్తు కొనసాగుతోంది. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్నికల అధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన నామినేషన్ల ప్రక్రియలో పోటాపోటీగా నామినేషన్లు వచ్చాయి. గతంలో జిల్లా అధ్యక్షునిగా పని చేయడానికి నాయకులు విముఖత చూపేవారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అధ్యక్ష పదవికి పోటీ ఏర్పడింది. జిల్లాలోని కొంతమంది నాయకులు ఆ పార్టీలో చేరడం, సిర్పూర్ ఎమ్మెల్యేగా పాల్వాయి హరీష్‌బాబు గెలవడంతో అనుకూలతలున్నాయనే భావనతో ఆ పార్టీ అధ్యక్ష పదవికి ఒకేసారిగా పోటీ పెరిగింది. దీంతో ప్రస్తుత అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్‌తో పాటు జిల్లా కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు బోనగిరి సతీష్‌బాబు, జిల్లా నాయకులు చర్ల మురళీ సుదర్శన్‌గౌడ్‌తో పాటు మరో ముగ్గురు పోటీ పడుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఎనిమిది నామినేషన్లు రాగా ఇంకా మరికొన్ని నామినేషన్లు వచ్చే అవకాశాలున్నాయి. అధ్యక్షునిగా పోటీ చేయాలంటే తప్పనిసరిగా రెండు మండలాల అధ్యక్షులు మద్దతు పలకాలనే నిబంధన పెట్టడంతో నాయకులు నిరాశ చెందినట్లు తెలిసింది. దీనిపై జిల్లా నాయకుల్లో కొంత సేపు చర్చ జరగడంతో పాటు ఈ నిబంధనను ఖండించడంతో పాటు కొత్త నిబంధనలు పెట్టడం సరైంది కాదని సీనియర్ నాయకులు వాదించినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం శనివారం నామినేషన్లు స్వీకరించి ఆదివారం అధ్యక్షుని ప్రకటించాల్సి ఉన్నప్పటికీ నాయకులు మండి పడటంతో కొంత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఏదేమైనా బీజేపీలో జిల్లా అధ్యక్ష పదవి వ్యవహారం కొత్త మంట పుట్టించేలా ఉందని ఆ పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్లు వేసిన వారి పేర్లను ఎన్నికల అధికారి అరుణ్‌కుమార్‌ను అడగగా పార్టీ జిల్లా అధ్యక్షుడు వెల్లడిస్తాడని తెలపడం కొసమెరుపు.

జిల్లా పేరును నిలబెట్టాలి : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ-నేరడిగొండ

ఆర్మూర్‌లో జరుగుతున్న సాఫ్ట్ బాల్ స్టేట్ మీట్‌లో జిల్లా పేరు నిలబెట్టాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సాఫ్ట్‌బాల్ స్టేట్ మీట్‌కు వెళ్తున్న సీనియర్ క్రీడా కారులకు శనివారం జెర్సీలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి స్థానంలో నిలిచి కప్పుతో రావాలని తెలిపారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు గూడం జ్యోతిరామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, నిర్వాహక కార్యదర్శి అఖిల్, జాయింట్ సెక్రెటరీ నాగరాజు, రాధేశ్యాం గౌతమ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవి కాల ముందస్తు ప్రణాళిక చర్యలో భాగంగా విద్యుత్ లైన్ మరమ్మతుల కోసం జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రాల్లోని రవిచంద్ర కాలనీ, నూర్‌నగర్, సందీప్‌నగర్, బజార్‌వాడి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంతం, కసబ్‌వాడి, బ్రాహ్మణవాడ, వివేకానందచౌక్, గాంధీచౌక్, మెయిన్ రోడ్ నుండి కొమరం భీం చౌక్ వరకు, పైకాజి నగర్ ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని తెలిపారు. అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

బాకీ డబ్బులు రావడం లేదని పురుగులమందు తాగి ఇద్దరు ఆత్మహత్య

- మరొకరి పరిస్థితి విషమం

నవతెలంగాణ- తలమడుగు

మండలంలోని ఉమ్డం గ్రామ శివారు ప్రాంతంలో ఓ చేనులో ముగ్గురు పురుగులమందు తాగిన ఘటన చోటు చేసుకుంది. ఇందులో ఇద్దరు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మరణించగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఉమ్డం గ్రామానికి చెందిన ఆకుల రాకేష్(35) తన మేనమామ లక్షెట్టి స్వామి ఊరైన తాంసి మండలం కప్పర్లలో ఉంటున్నారు. పొలం సొంతూరు ఉమ్డంలో ఉండటంతో కప్పర్ల నుంచి ద్విచక్ర వాహనంపై రాకేష్ భార్య లావణ్య, మేన మరదలు స్పందన(19), కూతురు ప్రశంసతో కలిసి చేనుకు చేరుకున్నారు. వెంట తెచ్చుకున్న పురుగులమందును మొదటగా రాకేష్ తాగగా వెంటనే మేన మరదలు స్పందన, తర్వాత భార్య లావణ్య తాగారు. ఈ విషయాన్ని గమనించిన కూతురు ప్రశంస వెంటనే కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించింది. కుటుంబీకులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని వీరిని రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు రాకేష్, స్పందన అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ప్రస్తుతం రాకేష్ భార్య లావణ్య చికిత్స పొందుతుండగా ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కుటుంబంలోని ముగ్గురు ఒకేసారి బలవన్మరణానికి పాల్పడడం, ఇద్దరు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. ఈ విషయం దావనలంలా వ్యాపించడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రిమ్స్ వద్దకు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అక్కడున్న వారిని కలిచివేశాయి. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు సమగ్ర విచారణ ప్రారంభించారు. రిమ్స్ ఆస్పత్రిలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై అంజమ్మ మృతదేహాలను పరిశీలించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలో మృతుడు రాకేష్ పురుగుమందుల దుకాణం నిర్వహిస్తున్నాడు. రాకేందర్ అనే వ్యక్తి నుంచి మృతుడికి రూ.60లక్షలు రావాల్సి ఉండగా పదే పదే అడిగినప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడంతోనే మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడు రాకేష్ బావమరిది నగేష్ పోలీసులుకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా మృతుడి కుటుంబీకులను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, మాజీ మంత్రి జోగురామన్న, మాజీ జడ్పీటీసీ పులి నారాయణ, మాజీ సర్పంచ్ గంగయ్య ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.







భార్యతో రాకేష్(ఫైల్)

మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి

- కనిపించకుండా పోయిన బాలుడు
- తల్లితో కలిసి కారులో వెళ్లిన కొడుకు



మంచిర్యాల: తల్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, కొడుకు కనిపించకుండా పోయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వారం క్రితం తల్లీకొడుకు కారులో వెళ్లగా తల్లి విగతజీవిగా మారగా, కొడుకు ఆచూకీ లేకుండా పోయింది. తన కొడుకు ఏమైపోయాడో అంటూ తండ్రి రోదిస్తున్న తీరు అందరినీ కలిచి వేస్తోంది. బాబు ఆచూకీ కనిపెట్టాలంటూ తండ్రి నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాసిపేటకు చెందిన మేడ భరత్ ఆరేండ్ల క్రితం పెంచికల్‌పేటకు చెందిన మమతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రయివేట్ డ్రైవర్‌గా పని చేసే భరత్ భార్యతో కలిసి మంచిర్యాలలో నివాసముండేవాడు. వీరికి బాబు ధృవన్(4) ఉన్నాడు. అన్యోన్యంగా సాగుతున్న వీరి జీవితంలో కొంత కాలం క్రితం విబేధాలు ఏర్పడ్డాయి. ఫోన్‌లో మాట్లాడుకోవడమే తప్ప ఒకరికి ఒకరు కలుసుకోక రెండేండ్లు గడిచింది. మమత మంచిర్యాలలోని స్నేహితురాలి ఇంట్లో ఉంటూ క్యాటరింగ్ వర్క్ చేసుకుంటూ బాబును పోషించుకుంటోంది. జనవరి 25న నస్పూర్ నుంచి మమత బాబు ధృవన్‌తో కలిసి కారులో వెళ్లారు. మరుసటి రోజు ఆమె కరీంనగర్ జిల్లా గంగాధరలోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న తోటలో శవమైంది. స్థానికుల సాయంతో సమాచారం అందుకున్న గంగాధర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతురాలి ఫొటో అన్ని పోలీస్‌స్టేషన్‌లకు పంపించారు. మంచిర్యాలలో ఉండే భర్త గుర్తించి మమత మృతదేహాన్ని స్వాధీన పరుచుకొని అంత్యక్రియలు నిర్వహించాడు. కానీ తల్లితో వెళ్లిన బాబు ఏమయ్యాడో తెలియడం లేదు. మమత బాబుతో కలిసి కారులో ఎటు వెళ్లాలనుకుంది..ఎవరితో వెళ్లింది..ఎవరు అఘాయిత్యానికి పాల్పడ్డారు..అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి ఆచూకీ కోసం ఇటు నస్పూర్, అటు కరీంనగర్ జిల్లా గంగాధర పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. 6 రోజులులైనా బాబు ఆచూకీ దొరకకపోవడంతో తండ్రి, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసులకు తీవ్ర అన్యాయం

ఆదిలాబాద్‌టౌన్ : పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికసిత్ భారత్ అంటూ ప్రచారాన్ని ఊదరగొట్టిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం గిరిజనులను మరింత పేదరికంలో నెట్టే విధంగా బడ్జెట్ కేటాయింపులున్నాయని విమర్శించారు. మొత్తం 50,65,345 కోట్ల బడ్జెట్లో దేశ గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగబద్ధంగా కేటాయింపులు చేయాల్సిన 7 శాతం ప్రకారం గిరిజన సబ్ ప్లాన్ కు 3,54,574 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం 1,29,249 కోట్లు మాత్రమే కేటాయించి గిరిజనులకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఇందులోనే గిరిజన వ్యవహారాల శాఖకు గత ఏడాది 13,000 కోట్లు కేటాయించగా ఈ ఏడాది బడ్జెట్లో అదనంగా కేవలం 1925 కలిపి 14,925 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధికి నేరుగా ఉపయోగపడే రంగాల్లో కేటాయింపులు పూర్తిగా తగ్గించి కార్పొరేట్లు, బడా కాంట్రాక్టర్లు, ధనవంతుల ప్రయోజనాలకు లబ్ధి చేకూర్చే రంగాల్లో మాత్రం గణనీయమైన కేటాయింపులు చేసిందన్నారు. ఉన్నత విద్యలో గిరిజన విద్యార్థులను మరింత ప్రోత్సహించాల్సిన కేంద్ర ప్రభుత్వం గతేడాది 240 కోట్లు కేటాయించగా ఈ ఏడాది కేవలం 2 కోట్లు మాత్రమే కేటాయించడం దేనికి సంకేతమో కేంద్రం ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుంటాల గ్రామంలో గల ఆశ్రమ పాఠశాలలో వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థినులకు టీబీ, క్షయ, తల సేమియా వంటి పరీక్షలు నిర్వహించారు. రక్త నమూనాలు సేకరించారు. ఈ పరీక్షల్లో ఒక విద్యార్థికి తలసేమియా పాజిటివ్ వచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థినులు ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, పరిశుభ్రత పాటించాలని, పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని హెచ్ఈఓ పవర్ రవీందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, పాఠశాల ఉపాధ్యాయులు నిఖేత్, ఎఎన్ఎం జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాల్మీకి నగర్ కాలనీలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌ను ఒకటవ తరగతి విద్యార్థులు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఒకటవ తరగతి విద్యార్థులకు కూరగాయల మార్కెట్లో ఆకుకూరలు, కూరగాయలు వాటి ఉపయోగాలను గురించి, వాటిని ఎలా వాడాలో విద్యార్థులకు వివరించారు.



వ్యాక్సిన్ తప్పకుండా తీసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

గర్భిణులతో పాటు చిన్నారులు వ్యాక్సిన్ తప్పకుండా తీసుకోవాలని సుపర్‌వైజర్ చరణ్‌దాస్ సూచించారు. శనివారం మండలంలోని కొత్తపల్లి సబ్ సెంటర్ పరిధిలోని గ్రామం ఎంపల్లి తండలో చిన్నపిల్లలకు గర్భిణులకు వాక్సిన్ ఇచ్చారు. ఆశా కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ కుటుంబ సర్వేలు చేసి వారిని ప్రోత్సహించాలని అన్నారు. అన్ని రకాల రిజిస్టర్‌లు ఉండాలని సూచించారు. వారి వెంట వైద్య సిబ్బంది శ్యామక, ఆశా రాథోడ్ వందన, లేతూ బాయి ఉన్నారు.



రాముని పేరు చెప్పుకుని గెలిచిన ఎంపీ, ఎమ్మెల్యే

- రామునికి బీఆర్ఎస్ నాయకుల వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో రాముని పేరు చెప్పుకొని గెలుపొందిన బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు ఆదిలాబాద్‌లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకులు ధమ్మపాల్ డిమాండ్ చేశారు. శనివారం సీసీఐ రామాలయంలో పూజలు చేసి రాముని విగ్రహానికి వినతిపత్రం అందించారు. బడ్జెట్ సమావేశాల్లో ఆదిలాబాద్‌కు నిధులు కేటాయించడంతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు ఎంపీ, ఎమ్మెల్యేలు కృషి చేయాలని పోస్టర్లు, కరపత్రాలను ప్రదర్శించారు. ఎన్నికల్లో అభివృద్ధి మాట లేకుండా, రామనామ జపంతో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు గెలిచారని అన్నారు. కానీ రాముని స్ఫూర్తిని విస్మరించారని ఆరోపించారు. జిల్లా అభివృద్ధికి సీసీఐ ఫ్యాక్టరీ పున్నప్రారంభం, విమానాశ్రయం, ఆదిలాబాద్ ఆర్మూర్ రైల్వేలైన్, టెక్స్‌టైల్ పార్క్‌పై పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా శనివారం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. దీనికి ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. అదే విధంగా జిల్లాలో పరిశ్రమను ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కొండ గణేష్, సాయిప్రణయ్, బట్టు సతీష్, మౌర్య సురేందర్, సుగ్గే విఠల్, గంగాధర్, రాథోడ్ గజు, నర్సాగౌడ్, సాయి పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూస్తాం

- ఎంపీఓ మోహన్ సింగ్



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని ఆయా గ్రామాల్లో రానున్న వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ముందుగానే తాగునీటి సమస్యలు తెలుసుకునేందుకు గ్రామంలో పర్యటిస్తున్నామని అన్నారు. శనివారం మండలంలోని చోండి, గొడిసెర, సౌన గ్రామంలో మిషన్ భగీరథ అధికారి ప్రశాంత్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ రాజేష్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలకు రానున్న వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అదే విధంగా కొన్ని గ్రామాల్లో ఇప్పటికి మిషన్ భగీరథ పైపులైన్‌లు లీకేజీలు ఏర్పడటంతో కొన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిసిందని అన్నారు. గ్రామంలో ఉన్న నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చూడాలని అన్నారు. అదే విధంగా మురుగు కాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. లేని యెడల పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామంలో వేసవి కాలంలో అన్ని గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమేష్, సాయినాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్యాంసుందర్

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



బజార్‌హత్నూర్ తహసీల్దార్‌గా ఏ.శ్యాంసుందర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన గుంజాల శంకర్ పదవీకాలం ముగియడంతో జైనథ్ తహసీల్దార్‌గా పనిచేసిన శ్యాంసుందర్ బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హీరలాల్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌రెడ్డి, ఆర్ఐలు శ్యాంసుందర్‌రెడ్డి, నర్సింగ్, జూనియర్ అసిస్టెంట్లు కరుణాకర్, మెహరాజ్, సంజీవ్ కుమార్, స్రవంతి, ఆపరేటర్ ఆశన్న కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోవర్ధన్

నవతెలంగాణ-బోథ్



తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మహా సభలు కోరుట్లలో నిర్వహించారు. ఈ సభల్లో తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ బీడీ వర్కర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కాగా బోథ్ మండల కేంద్రానికి చెందిన బి.గోవర్ధన్‌ను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఇంత పెద్ద అవకాశాన్ని సక్రమంగా నిర్వహించే బాధ్యత తనపై ఉందని, బీడీ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నాగోబాకు వీడ్కోలు.. శ్యాంపూర్‌కు పయనం..

- గోవాడ వద్ద బేతాల్ నృత్యం
- మండగాజలింగ్‌తో ముగింపు







నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గిరిజనుల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా జాతరకు మెస్రం వంశీయులు బేతాల్ నృత్యం, మండ గాజలింగ్ పూజలు చేశారు. ముందుగా గోవాడ్ ముందు మెస్రం పటేళ్లకు మెస్రం కోడళ్లు కాళ్లను కడిగి సాదరంగా ఆహ్వానించారు. వారి సాంప్రదాయ వాయిద్యాలైనా కాలికొమ్, డోలు, పెప్రేను వాయిస్తూ.. బేతాల్ పూజలను నిర్వహించారు. మెస్రం పటేళ్లను మెస్రం ఆడపడుచులు, భేటింగ్ కోడళ్లు వేర్వేరుగా పాదాభివందనం చేశారు. వారి ఆచారం ప్రకారం ప్రధాన్‌లకు కానుకలను సమర్పించారు. అనంతరం నాలుగు దిక్కుల తమల పాకును సమర్పించారు. చిన్ను, వెంకట్ రావ్, బాది పటేల్, కొత్వాల్ తిరుపతి, దాదేరావ్‌ల ఆధ్వర్యంలో వెదురు కర్రతో బేతాల్ ఆటను ఆడారు. అనంతరం మెస్రం వంశీయులు, కొత్త భేటింగ్ కోడళ్లు సామూహిక నృత్యాన్ని చేశారు.

మండ గాజలింగ్ పూజలు..

మెస్రం వంశీయుల నాగోబా సన్నిధిలో సమర్పించిన పేలాలు, కొబ్బరికాయలు, కట్నం కానుకలను ఒక చోటికి పేర్చారు. కట్నం కానుకలు పంచుకున్నారు. అనంతరం పూజకు తెచ్చిన కుండలను వంశం పెద్ద మహిళలకు అందజేశారు. అనంతరం కేస్లాపూర్ నాగోబా జాతరకు వీడ్కోలు పలికి, ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్‌లోని బుదుం దేవ్ జాతరకు పయనమయ్యారు.

ఉజ్వల భవిష్యత్‌కు చదువే పునాది

- డీఈఓ పి.రామారావు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ఉజ్వల భవిష్యత్‌కు చదువే పునాది అని డీఈఓ పి.రామారావు అన్నారు. శనివారం నిర్మల్ ఆస్రా కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, రాబోయే పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టులో ఎన్ని చాప్టర్లు ఉన్నాయో అడిగి సమాధానం రాబట్టారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి 100శాతం ఉత్తీర్ణతను సాధించాలని అన్నారు. పది ఫలితాలలో నిర్మల్ జిల్లాను మరోసారి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలపాలన్నారు. పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విషయ ఉపాధ్యాయులు ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేసి, అమలు చేయాలని, ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు తాము దత్తత తీసుకున్న విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 5 గంటలకు, రాత్రి పూట ఫోన్ చేసి, విద్యార్థుల చదువు గురించి తల్లిదండ్రులను వాకబు చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల ప్రగతి మెరుగుపరచడానికి విషయాల వారీగా, చాప్టర్ల వారీగా విద్యార్థుల వారీగా స్లిప్ టెస్ట్‌ల మార్కులను సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. గత సంవత్సరం పదో తరగతి ప్రశ్న పత్రాలతో ప్రాక్టీస్ చేయించాలన్నారు. విద్యార్థులకు మోటివేషన్ తరగతులను నిర్వహించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన వంట గదిని, స్టోర్ రూమ్‌ను, పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని, తాజా ఆహార పదార్థాలను, ఉపయోగించాలని మెనూ ప్రకారం వంట చేయాలని, వంట కార్మికులకు సూచించారు. మధ్యాహ్న భోజనం విధానాన్ని ఫుడ్ సేఫ్టీ కమిటీ ద్వారా క్రమం తప్పకుండా పరిశీలింపజేయాలని నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిద్దెచింత గ్రామానికి విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-కడెం

మండలంలోని ఉడుంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మిద్దెచింత గ్రామానికి విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సునారికారి రాజేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ నాయకులు మాట్లాడారు. మండలంలోని ఉడుంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మిద్దెచింత గ్రామంలో గత 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు. గ్రామంలో 50 కుటుంబాలు, 250 జనాభా జీవిస్తున్నారని పేర్కొన్నారు. వారికి 50 సంవత్సరాల నుంచి కనీసం కరెంటు, రోడ్డు సౌకర్యం లేక ఆదివాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో కరెంటు మంజూరు చేసి మూడు రోజులు వెలిగిన తర్వాత ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా కరెంటు నిలిపివేశారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు చీకట్లో ఆదివాసులు జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. గ్రామంలో కనీసం చిన్న పిల్లలకు చదువుకోవడానికి అంగన్‌వాడీ కేంద్రం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి నేటికీ దాదాపుగా 80 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఆదివాసులకు సమస్యలు చీకట్లో, పూరి గుడిసెల్లో, అంధకారంలో మునిగిపోతున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారినా

ప్రజా ప్రతినిధులు మారిన మిద్దెచింత గ్రామ ప్రజల సమస్యలు, బతుకులు మారటం లేదని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి సీసీ రోడ్డు, డ్రైనేజీ, ఇందిరమ్మ ఇండ్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. లేని యెడల భవిష్యత్తులో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నర్సయ్య, ఐఎఫ్టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, ఏఐకేఎంఎస్ నాయకులు గూట్ల ప్రసాద్, గ్రామాధ్యక్షులు ఆత్రం మాణిక్‌రావు, సోయం దాదేరావు, మర్సుకోల లింగు, మోతీరాం, గేడం మోహన్‌రావు, సోయం చందు, శ్రీరామ్, భీమ్‌రావు ఆదివాసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మార్కండేయుని జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికి స్ఫూర్తి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పరమశివుని అనుగ్రహంతో అమరజీవిగా వరాలు పొందిన మార్కండేయుని జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం శ్రీ మార్కండేయ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శివ మార్కండేయ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలి సమాజం తరఫున ప్రతిచోట పట్టణం, పల్లెల్లో మార్కండేయ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం పట్ల అభినందించారు. భాగ్యనగర్ ఆలయ కమిటీ ప్రాతినిధ్యం మేరకు ఆలయ పునర్ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎండోమెంట్ అధికారులకు సూచించారు. అనంతరం భాగ్యనగర్ పద్మశాలి ఆలయ కమిటీ తరపున ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం శ్రీ మార్కండేయ జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలి అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ జిల్లా అధ్యక్షులు బేత రమేష్, తాలూకా అధ్యక్షులు బొమ్మకంటి రమేష్, జిల్లా కన్వీనర్ జక్కుల సత్యనారాయణ, చిలుక విలాస్, చిప్ప గంగన్న, దాసరి రమేష్, మాటేటి రాజు, రాకేష్, సాయి కృష్ణ, సాయి ప్రశాంత్, సత్యనారాయణ, సామల రాజన్న, దాసరి ప్రశాంత్, సాయి కృష్ణ, పూజారి సత్యనారాయణ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పద్మశాలి కుల దైవం శ్రీభక్త మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు సామల వీరయ్య, సభ్యులు లక్ష్మీనారాయణ, భీమలింగం, శంకర్, శ్రీనివాస్, నరేష్, కులస్తులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కుభీర్ ఆశ్రమ పాఠశాల తనిఖీ



నవతెలంగాణ-కుభీర్

ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించి, వారికి ఎలాంటి సమస్యలు రాకుండా ఉండాలనే ఉద్యేశంతో ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అన్ని వస్తువులు అందుతున్నాయా లేదా అనే విషయాన్నీ తెలుసుకోవడానికి శనివారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను ఎంపీడీఓ నవనీత్ కుమార్, ఎంపీఓ మోహన్ సింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదే విధంగా విద్యార్థులకు రాత్రి సమయంలో చలికి రక్షణగా రగ్గులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని పాఠశాల ఉపాధ్యాయుడికి సూచించారు. అయన వెంట ఉపాధ్యాయుడు, విద్యార్థులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-బేల

మండలంలోని శంషాబాద్ గ్రామానికి చెందిన కౌలు రైతు ఖోడే గోవింద్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే పాయల శంకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. పిల్లల చదువుకు అండగా ఉంటాన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా అసెంబ్లీ కన్వీనర్ విజయ బోయర్, బీజేపీ మండలాధ్యక్షుడు వట్టిపెల్లి ఇంద్రశేఖర్, మురలీధర్, దత్తా నిక్కం, ఖోడే ప్రదీప్, మోరేశ్వర్, ఠాక్రే సందీప్, మాజీ సర్పంచ్ బోడుకుంట రాకేష్, పోతురాజ్ నవీన్, జీవన్, మహేష్ ఉన్నారు.

వేసవి కాలంలో నీటి కొరత లేకుండా చర్యలు

నవతెలంగాణ-ఇచ్చోడ



వేసవికాలంలో మిషన్ భగీరథ నీటి కొరత లేకుండా చూసేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ డీఈ భూక రామకాంత్ అన్నారు. శనివారం మండలం కేంద్రంలో రాబోయే వేసవి సన్నద్ధతలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ, డీఈ బుకా రమాకాంత్ మాట్లాడుతూ వేసవి సన్నద్ధతలో భాగంగా ఫిబ్రవరి 1నుంచి 10వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్పెషల్ డ్రైవ్ పూర్తయ్యేలోపు అన్ని మిషన్ భగీరథ నిర్మాణాలను, పైప్‌లైన్‌లను పూర్తి వినియోగంలో ఉండేట్టు చూసి, అన్ని గ్రామాల్లో ప్రతీ వ్యక్తికి 100 లీటర్ల నీరు అందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ దుమ్మ ఉమేష్, ఇంజనీర్ సైదులు సూపర్‌వైజర్లు బొప్పారపు శ్రీకాంత్, రిషి, అశోక్, ప్రశాంత్, ఆరిఫ్ పాల్గొన్నారు.

5న కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 5న అప్‌గ్రేడ్ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యాక్సిస్ బ్యాంక్, ముతూట్ ఫిన్ కార్ప్ కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.అతీక్ బేగం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగానికి ఏదైనా డిగ్రీ 50శాతం మార్కులతో పూర్తి చేసుకొని, 30 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారికి రూ.18 వేలకు పైగా వేతనం ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో, ఆధార్, పాన్ కార్డులతో ఈనెల 5న ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డా.కోటయ్య, మెంటార్ చైతన్య, 9885762227 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యార్థులకు కౌన్సెలింగ్ తరగతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారి డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్, డిగ్రీ రెండవ సంవత్సరం మూడవ సెమిస్టర్, డిగ్రీ మూడవ సంవత్సరం ఐదవ సెమిస్టర్ విద్యార్థులకు కాంటాక్ట్ కం కౌన్సెలింగ్ తరగతులను ఈనెల 2న నిర్వహిస్తున్నట్టు సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, యూనివర్సిటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జగ్‌రామ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే పీజీ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ తరగతులు ఉంటాయని విద్యార్థిని, విద్యార్థులందరూ హాజరు కావాలని సూచించారు.

బడ్జెట్‌లో పాత విధానంలో ఎలాంటి మార్పు చేయలేదు

- టి.నరేంద్రబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బడ్జెట్‌లో పాత విధానంలో ఎలాంటి మార్పు చేయలేదు భారతదేశానికి సేవింగ్స్ ఆయువు పట్టు వంటివి. పాత విధానంలో సేవింగ్స్ స్లాబ్ రేట్స్ పెంచలేదు. కొత్త విధానంలో స్లాబును రూ. 7 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడాన్ని హర్షిస్తున్నామని, ఇది కొత్త విధానం వారికి వర్తిస్తుంది. కొత్త విధానంలోకి అందరిని తీసుకురావడానికి చేసిన ప్రయత్నంగా అనిపిస్తున్నది. ఇది చాలా తక్కువ మందికి ప్రయోజనం చేకూరుతుంది.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ అండ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పేద ప్రజల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ అండగ ఉంటుందని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. కెరమెరి మండలంలోని కైరి గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా వాటిని ఆయా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి అండగా నిలిచే సీఎంఆర్ఎఫ్ డబ్బుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సెడ్మకి ద్రుపతబాయి, మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లెన్గురే బాలాజీ, అనుములే శంకర్, లబ్ధిదారులు గిర్మాజీ, రుక్మాబాయి, వాగు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు మార్గం కనుగొనాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



విద్యార్థులు ఎల్లవేళలా సృజనాత్మకతను ఉపయోగిస్తూ నూతన ఆవిష్కరణలకు మార్గం కనుగొనాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి సూచించారు. శనివారం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'విద్యార్థులు, సృజనాత్మకత' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఎల్లప్పుడూ విద్యార్థులు తమ మేధాశక్తికి పదును పెట్టాలని, ఒక లక్ష్యం ఏర్పరుచుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి తూడూరు దత్తాత్రేయ, సామాజిక సృజనాత్మకత కోఆర్డినేటర్ ఎస్.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు డి.జనార్దన్, ఎం రాజేశ్వర్, దేవేందర్, బి.వెంకటేశం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్‌తో 57 మందికి విముక్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో నెల రోజుల పాటు ప్రత్యేకంగా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ -11 విడుతలో 57 మంది బాలకార్మికులకు విముక్తి కలిగించినట్లు ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్-11వ విడుతలో జిల్లా వ్యాప్తంగా 57 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందన్నారు. ఆపరేషన్ స్మైల్ విజయవంతం కోసం జిల్లాలో 02 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. 57 మంది బాలకార్మికులను గుర్తించగా, ఇందులో 54 మంది బాలురు, 3 బాలికలున్నారని, ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో మొత్తం 21 మంది కాగా ఇందులో 21 మంది బాలురు, కాగజ్‌నగర్ సబ్ డివిజన్‌లో మొత్తం 36 మంది కాగా ఇందులో 33 మంది బాలురు, ముగ్గురు బాలికలున్నారు. జిల్లాలో మొత్తం 57 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను ప్రమాదకరమైన ప్రదేశాల్లో పనిలో పెట్టుకున్న యజమానులపై కేసు నమోదు చేశామన్నారు. 14 సంవత్సరాలలోపు బాలబాలికలను ఎలాంటి పనులలో పెట్టుకోవద్దని, అలాగే 15 నుంచి 18 సంవత్సరాల వయసు గల బాలబాలికలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టడం చట్టరీత్య నేరమన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఆపరేషన్ స్మైల్-11లో భాగంగా బాల కార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించిన ప్రత్యేక బృందాల సభ్యులను అభినందించారు.

కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని క్వాలిటీ విభాగంలో ఐటీ వింగ్ ద్వారా వాహనాలకు టోల్ గేట్స్ వద్ద జీపీఎస్, జీపీఆర్ఎస్ సిస్టం కాంట్రాక్ట్ సిబ్బంది పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. బీపీఏ జీఎం శ్రీనివాస్ సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి సింగరేణి సంస్థకు రూ. వేల కోట్ల రావడంలో కాంట్రాక్టు కార్మికుల పాత్ర అత్యంత కీలకంగా ఉందన్నారు. కాంట్రాక్టర్ సంస్థ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించడంలో విఫలమైందన్నారు. సింగరేణిలో ప్రతినెల 7లోపు వేతనాలు చెల్లించాలని ఉన్న అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. అధికారులు ఈ విధంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సమ్మె చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు జాడి సాయి, కోట ప్రవీణ్, మారం కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షునికి మాలీ సంఘం నాయకుల సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాలీల ఆరాధ్య దైవం జ్యోతిబాపూలే భార్య సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో మాలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును జిల్లా కేంద్రంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గౌరవాన్ని తాము మర్చిపోలేమన్నారు. మాలీలకు జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే ఆరాధ్య దైవమని అటువంటి వారిని గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాలీల సమస్య పరిష్కారం కోసం కూడా కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుని కోరారు. స్పందించిన ఆయన త్వరలో సీఎం అపాయింట్మెంట్ ఇచ్చేలా ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యమంలో జిల్లా నాయకులు గుర్నులె నారాయణ, అదే బాబూరావు, కవుడే దత్తు, సెండే దత్తు, నగోషె శంకర్, గుర్నులె మెంగాజి, మొహర్లె తిరుపతి, గుర్నులె మారుతి, మొహర్లె శ్రీకాంత్, వడై పాండు, వాడై రమేష్, వాడై ఆనందరావు, గుర్నులే ఆనందరావు పాల్గొన్నారు.

శిశుమందిర్ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శనివారం పాఠశాల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు సాయికిరణ్, కీర్తి, పాఠశాల సభ్యులు పాల్గొన్నారు.



గంగాపూర్ జాతరను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని గంగాపూర్‌లో ఈనెల 11 నుంచి 13 వరకు జరిగే శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి జాతరను అధికారులు సమన్వయంతో పనిచేసి ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి సంబంధిత అధికారులు, జాతర కమిటీ ప్రతినిధులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంగాపూర్ వెంకటేశ్వర స్వామి జాతరను ఘనంగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని చదును చేయాలని, దేవాలయానికి రంగులు వేయాలన్నారు. విద్యుత్ దీపకాంతులతో అలంకరించాలని, భక్తులకు ఆలయ ప్రాంతాలలో షామియాన ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి సమన్వయంతో ఆహ్వాన పత్రికలు, ఫ్లెక్సీలు సిద్ధం చేయాలని, జాతరలో ఏర్పాటుచేసి దుకాణాల వేలం పాటపై పత్రికలలో ప్రకటనలు వచ్చేలా చూడాలన్నారు. జాతరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్వామి వారి కళ్యాణ ఉత్సవాలకు ఇలాంటి ఇబ్బందులు రాకుండా దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ రాజ్, జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జాతరలో పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని, 50 మంది కార్మికులతో పనులకు సిబ్బందిని సర్దుబాటు చేయాలన్నారు. మండలంలోని 12 మంది పంచాయతీ కార్యదర్శులను పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణపై నియమించాలన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో జాతరలో శాంతి భద్రతల పరిరక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని, పార్కింగ్ ప్రాంతంలో సింగరేణి సంస్థ సమన్వయంతో లైట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 24 గంటలపాటు వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సేవల కోసం 2 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 3 రోజులపాటు నిరంతర విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయంగా జనరేటర్‌లను అందుబాటులో ఉంచాలని, 4 మంది లైన్‌మెన్లను నియమించాలని ఆదూశించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జరగకుండా వాహనాన్ని, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అధికారులు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. అధికారులు 3 రోజుల పాటు జాతర నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఆయలం వద్ద ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, సీఐ బుద్దె స్వామి, తహసీల్దార్ రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి

- జిల్లా విద్యాధికారి యాదయ్య
- జిల్లా స్థాయి రీడతాన్ పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల్లో చిన్ననాటి నుండి పఠనాసక్తిని పెంపొందింపజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి రీడతాన్ పఠన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి విద్యార్థులు కథలు, నీతి కథల పుస్తకాలు, మహనీయుల జీవిత చరిత్రలతో కూడిన పుస్తకాలు, నూతన ఆవిష్కరణ పుస్తకాలు చదవాలన్నారు. పుస్తక పఠనం ద్వారా మేధస్సు పెరుగుతుందన్నారు. చదవడంతో విజ్ఞానవంతులు అవుతారని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక్కొక్క పాఠశాలలో 300 గ్రంథాలయ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా చదవాలని, ఉపాధ్యాయులు గ్రంథాలయ పీరియడ్ సమర్థవంతంగా వినియోగించుకొని బోధన చేయాలని ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. 47 స్కూల్ కాంప్లెక్స్‌ల నుంచి 94 మంది కాంప్లెక్స్ స్థాయి రీడతాన్ పఠన పోటీల విజేతలు జిల్లాస్థాయి పఠన పోటీలకు హాజరు కాగా విద్యార్థులు పఠన సామర్థ్యాన్ని ఆధారంగా చేసుకొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే..

జిల్లా స్థాయి పోటీల్లో తెలుగు మాధ్యమంలో మొదటి బహుమతి సంజన(ఎంపీయూపీఎస్, చిన్న రాసపల్లి), ద్వితీయ బహుమతి జోగేష్ (ఎంపీపీఎస్, తుమ్మలగూడ, బెజ్జూర్), తృతీయ బహుమతి మహేశ్వరి (యూపీఎస్, కౌటి, కౌటాల), ఆంగ్ల మాధ్యమంలో మొదటి బహుమతి సాయి హంషిత్ (ఎంపీఎస్ కోయగూడ), ద్వితీయ బహుమతి అనిల్ (ఎంపీపీఎస్ సర్‌సిల్క్), తృతీయ బహుమతి చైతన్య (ఎంపీపీఎస్, వంకులం, రెబ్బెన) ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, బీఎడ్ కాలేజ్ కరెస్పాండెంట్ శివప్రసాద్, ప్రిన్సిపాల్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

2025-26 సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ విమర్శించారు. శనివారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది బడ్జెట్ కంటే సుమారు రూ. 3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జీడీపీ లోటు 4.4 శాతంగా చూపడంతో ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌ను తెలంగాణలోని కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా 2, 3 తేదీలలో తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘాల ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు జాదవ్ రాజేందర్, నాయకులు కృష్ణమాచారి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 ఆర్థిక సంవత్సర బడ్జెట్ కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. శనివారం బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ మండల భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో వెనక ఉన్న జిల్లాకు ప్రత్యేక బడ్జెట్ రిలీజ్ చేయాలనీ డిమాండ్ చేశారు. దేశ అభివృద్ధిని బలహీనపరిచే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం సరైనది కాదన్నారు. దేశంలో 77 కోట్ల మంది వ్యవసాయ రంగంలో ఉన్న కనీస మద్దతు ధర హామీ పదేండ్లుగా అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులకు ఎలాంటి భరోసా కల్పించలేదన్నారు. ఉపాధి కూలీలకు కూడా మొండిచెయ్యి చూపించారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మధిర ప్రభాకర్, మురళీ బాపన్నా, శంకరన్న, రాజం చందు, శ్రీనివాస్, గణేష్, రాజన్న, ప్రకాశ్, వేంకటేశ్వర్, భీమన్న, సురేష్, సురేందర్, నవీన్, శ్రీనివాస్, సూరజ్ వికాస్ పాల్గొన్నారు.



బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న రోజుల్లో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బాల్యవివాహాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సిబ్బందితో బాల్యవివాహాల నిర్మూలన తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివాహాల సీజన్ మొదలైనందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. దీనికోసం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీలను బలోపేతం చేసి అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టాలను ప్రజలకు వివరించడంతో పాటు ఎవరైనా అటువంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకొనే దిశగా సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో జరుగుతున్న వివాహాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. బాల్యవివాహాలకు సంబంధించి విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బాల రక్ష భవన్ సిబ్బంది శ్రవణ్ కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, డి.ప్రవీణ్ కుమార్, జమున, నవీన్ కుమార్ పాల్గొన్నారు.



ఆరోగ్యానికి కాపాడుకుంటూనే చదువులో రాణించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-రెబ్బెన

బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుతూనే చదువులో రాణించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం మండలం గంగాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన బేటి బచావో - బేటి పడావో కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ విద్యలోపు రాణించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ఆశ్రమ, గురుకుల బాలికల పాఠశాలలలో విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రతపై హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి విడతగా జిల్లాలో 12 పాఠశాలలలో చేపట్టడం జరిగిందని తెలిపారు. విద్యార్థినులు యుక్త వయసు సమయంలో మరింత శుభ్రత పాటించాలని, శరీరం దృఢంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రత ఉంటుందని, క్రీడారంగంలో సైతం రాణించవచ్చని తెలిపారు. బాలికలను కాపాడుకోవడం, చదివించుకోవడంతో పాటు వారిని స్వేచ్ఛగా అన్ని రంగాలలో తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిచయం అధికారి ఆడెపు భాస్కర్, రెడ్ ఎక్స్‌ప్రెస్ భాను కల్లుకూరి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద, కేజీబీవీ ఎస్ఓ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిన్నింగు మిల్లులలో పత్తి, పత్తి గింజల నిలువలు అధికంగా ఉండడంతో జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, జైనూర్ జిన్నింగ్ మిల్లులలో ఈ నెల 3, 4 తేదీలలో, రెబ్బెన మండలం కొండపల్లి, సిర్పూర్, కౌటాల జన్నింగ్ మిల్లులలో 3 నుండి 5వ తేదీ వరకు సీసీఐ పత్తి కొనుగోలను తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తదుపరి తేదీ నుండి యధావిధిగా కొనుగోళ్ళు కొనసాగుతాయని, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

3న అక్షరాభ్యాస కార్యక్రమం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వసంత పంచమిని పురస్కరించుకొని ఈ నెల 3న కాగజ్‌నగర్ పట్టణం ద్వారకా నగర్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గణపతి పూజ, సరస్వతి పూజ, హోమం నిర్వహించిన అనంతరం మూడేళ్లు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించనున్నట్టు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అడ్వైజర్ కమిటీ సభ్యునిగా జిల్లా వాసి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాండ్రే విశాల్ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కమిటీ లో చోటు కల్పించడం సంతోషంగా ఉందని, తనకు ఇచ్చిన బాధ్యత నెరవేరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొట్నాక్ విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, పార్టీ సీనియర్ నాయకులు బోనగిరి సతీష్ బాబు, మాజీ జడ్పీటీసీ అరిగేలా నాగేశ్వరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ కుమారి, తాలూకా కన్వీనర్ సొల్లు లక్ష్మి, ఎలాగతి సుచిత్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రవణ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్ పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ఓల్డ్ కాలనీ శ్రీ ఉమా మహేశ్వర మార్కండేయ దేవాలయంలో శనివారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ, అభిషేకం, భజన సంకీర్తనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి వెంకటేష్, కొంగ సంపత్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పద్మశాలి భవన్‌లో కూడా..

అదేవిధంగా పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలి భవన్‌లో కూడా మార్కండేయ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కులస్థులు పాల్గొన్నారు.

ఎస్సీఈఐయూ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నూతన క్యాలెండర్‌ను శ్రీరాంపూర్ సీఐటీయూ కార్యాలయంలో ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, కర్షకులకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అంబాల శ్రీనివాస్, బ్రాంచ్ నాయకులు పెరుక సదానందం, మేల్లం శ్రీధర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం నిషేధాజ్ఞలు కొనసాగింపు

నవతెలంగాణ-జైపూర్

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారి ఆగడాలపై అందుతున్న ఫిర్యాదుల మేరకు ఈ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మద్యం సేవించిన వారు వీధుల్లో తిరుగుతూ అసభ్య పదజాలంతో మాట్లాడటం అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా మారినందున వారి ఆగడాలను అరికట్టడం కోసం నిషేదాజ్ఞల కొనసాగింపు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 1 నుండి మార్చి 01 వరకు నిషేదాజ్ఞలు కొనసాగుతాయని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత 223 హైదరాబాద్ పోలీస్ నగర పోలీస్ చట్టం 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లంఘించన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

తాగునీటి సరఫరాపై స్పెషల్ డ్రైవ్



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని గురీజాల, దుగ్నేపల్లీ గ్రామంలో మండల అధికారుల బృందం పర్యటించి తాగు నీటి సరఫరా ట్యాంకులను పరిశీలించారు. తాగునీరు సరఫరా చేసే పైపు లైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని కార్యదర్శిలకు సూచించారు. గ్రామపంచాయతీలలో ఇంటింటా పర్యటించి, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను పరిశీలించి మిషన్ భగీరథ వాటర్‌ను తాగు నీటి అవసరాలకు వాడుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యటనలో ఎంపీఓ వి శ్రీనివాస్ మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ కుమార్ ఏఈ ఎం శ్రీనివాస్, పంచాయతి కార్యదర్శులు లక్ష్మీ, దివ్య పాల్గొన్నారు.

యాదవులను ప్రభుత్వం ఆదుకోవాలి

- యాదవ సంఘం మండల అధ్యక్షుడు జంగిలి సత్తన్న



నవతెలంగాణ-జన్నారం

యాదవులను ప్రభుత్వం ఆదుకోవాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు జంగిలి సత్తన్న అన్నారు. శనివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యాలెండర్‌ను మండలం ఎస్ఐ రాజ వర్ధన్ తహసీల్దార్ రాజ మనోహర్, ఎంపీడీఓ ఆఫీస్ సబార్డినేట్ వెటర్నరీ డాక్టర్ శ్వేతాలు వేరువేరుగా ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవులంతా ఐక్యంగా ఉండి పోరాటం చేస్తేనే తమ హక్కులను సాధించుకోవచ్చు అన్నారు. ఉపాధ్యక్షుడు వంగ శ్రీనివాస్ యాదవ్, బైరి తిరుపతి యాదవ్, క్యాషియర్ మేంగని మహేష్ యాదవ్, హార్వెస్టర్ సంఘం మండల అధ్యక్షుడు ఏనుకుసి వెంకటేష్ యాదవ్, సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గట్టు మహేష్ యాదవ్, పిండి నరేష్ యాదవ్ పాన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓకు సన్మానం



నవతెలంగాణ-జన్నారం

ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతులు చేపట్టిన ఉమర్ శరీఫ్‌ను శనివారం పంచాయతీ కార్యదర్శులు శాలువా పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉమర్ శరీఫ్, కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు లకావత్ శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులంతా సమిష్టిగా కృషిచేసి మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. జిల్లాలోనే మండలాన్ని ఉత్తమ మండలంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ జలంధర్, వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు చంద్రమౌళి రాజ్‌కుమార్, లతా సరిత, శ్రీపాల్ వినోద్ కుమార్, కరుణ విశ్వశ్రీ వరలక్ష్మి, రమేష్, శ్రీకాంత్, మహేష్, విజయ్ కుమార్, రాహుల్ రమేష్, సాగర్, రాజేశ్వరి, లావణ్య, మధు కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ క్యాంపెయింగ్ ప్రోగ్రాం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహాత్మ సంతోష్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం శనివారం దండేపల్లి, జన్నారం మండలలోని జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ క్యాంపెయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జూనియర్ కళాశాలల విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మౌలిక సదుపాయాలతో పాటు నిష్ణాతులైన అధ్యాపక బృందం గురించి, కళాశాలలోని ప్రభుత్వ బాల, బాలికల హాస్టల్స్ గురించి, కళాశాలలోని వివిధ కోర్సుల గురించి వివరించారు. ఇంటర్ తర్వాత విద్యార్థులు లక్షెటిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొంది తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిందిగా చూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దండేపల్లి, జన్నారం జూనియర్ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గయ్యకు ఘన సన్మానం

మందమర్రి: ఆర్టీసీలో పనిచేసి పదవీ విరమణ పొందిన మాల మహానాడు జిల్లా కార్యదర్శి నాగుల దుర్గయ్యను మాల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జలి లక్ష్మణ్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం ఆర్టీసీలో తన సేవలందించిన దుర్గయ్య ఉద్యోగ విరమణ అనంతరం నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, మాల మహానాడు మందమర్రి పట్టణ, జిల్లా, రాష్ట్ర, నాయకులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్





నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో రైతులు వ్యవసాయ సాగులో లబ్ధి పొందే విధంగా ప్రత్యామ్నాయ, వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన, ఉద్యానవన శాఖ అధికారి అనిత, జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్‌తో కలిసి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణా అధికారులు, పశు వైద్య శాఖ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని, ఈ నేపథ్యంలో జిల్లాలో చేపట్టవలసిన వ్యవసాయ పనులపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. సాధారణ పంటలు మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటలు, కూరగాయల సాగుపై రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. పాడి రైతులు పౌల్ట్రీ, గొర్రెల పెంపకం, చేపల పెంపకంపై దృష్టి సారించాలని తెలిపారు. అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్, పండ్ల పెంపకంపై ప్రభుత్వం ప్రత్యేక అవకాశాలు కల్పిస్తుందని, వ్యవసాయ అధికారులు ప్రభుత్వ పథకాలను రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 3 వేల ఎకరాల ఆయిల్ పామ్ తోటల సాగు లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలలో రైతులు లబ్ధి కొరకు రాయితీ, కూలి ధరలు, ఆయిల్ ఫామ్ జిస్ట్రేషన్ ప్రక్రియ అంశాలపై వివరించారు. 5 ఎకరాల కంటే తక్కువ భూమి విస్తీర్ణం గల రైతులకు ప్రభుత్వ పథకాల ద్వారా లాభ పడేలా వివరించాలని, ప్రతి రోజు 5 నుండి 10 మంది రైతులకు లాభదాయక మార్గాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



నవతెలంగాణ-తాండూర్

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తాండూర్ సీఐ కుమారస్వామి కోరారు. శనివారం మండలంలోని అచ్చులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గంజాయి మాదకద్రవ్యాలపై అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత గంజాయికి అలవాటు పడినట్లయితే భవిష్యత్తును నాశనం చేసుకున్న వారు అవుతారని తెలిపారు. తల్లిదండ్రులు పెరుగుతున్న పిల్లల కదలికలను కనిపెడుతూ పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని తెలిపారు. విద్యార్థులు యువకులు, మత్తు పదార్థాలకు అలవాటు పడితే మెదడు చురుకుదనం కోల్పోయి మానసిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందన్నారు. విద్యార్థులు గంజాయి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి సభాదక్షత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి వహించగా అతిథులుగా మడల విద్యాధికారి ఎస్ మల్లేశం, ఎస్ఐ కుమారస్వామి, బెల్లంపల్లి డివిజన్ ఎక్సైజ్ ఎస్ఐ ఎం వెంకటేష్ పంచాయతీ కార్యదర్శి కల్పన, పాఠశాల సలహాదారులు సీహెచ్ విజయ్ కుమార్, నిర్వాహకులు దుద్దిల్ల విష్ణువర్ధన్, అభినవ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

తాగు నీటి సరఫరాను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-జైపూర్

మండలంలో తాగు నీటి సరఫరాను మండల అధికారుల బృందం శనివారం పరిశీలించింది. స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ, ఈఈ(డివిజన్) జీ వెంకటేశ్, డీప్యూటీ ఈఈ (గ్రిడ్ సబ్ డివిజన్) వీ వెంకటేశ్, ఎంపీఓ శ్రీపతి బాపురావు, డిప్యూటీ ఈఈ (ఇంట్రా చెన్నూర్) విద్యాసాగర్ ఏఈ వినయ్ కుమార్‌లతో కూడిన బృందం మండలంలో పర్యటించారు. ఓవర్ హెడ్ ట్యాంకుల స్థితిగతులు, నీటి సరఫరా, ఇంటింటికి నేరుగా నీరు చేకూర్చడం, పైప్‌లైన్ లీకేజీల సవరింపులు గ్రామ పంచాయతీ కార్యదర్శులు చూసుకోవాలని సూచించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులకు మిషన్ భగీరథ వాటర్‌లైన్ అనుసందానం చేస్తూ ఇంటికి నీటి సరఫరా చేయడం బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ క్రమంలో ఇందారం గ్రామ పంచాయతీ పరిధి దొరగారిపల్లి, నజీర్‌పల్లి హ్యాబిటేషన్లలో ఇల్లిల్లూ



తిరుగుతూ మిషన్ భగీరథ నీటిని తాగు నీటి అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు సుమన్, రజిత పాల్గొన్నారు.

ఆమోదయోగ్యం లేని కేంద్ర బడ్జెట్

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

నవతెలంగాణ-జైపూర్



2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆమోద యోగ్యం కాదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్ పట్ల ఢిల్లీలో ఆయన శనివారం మీడియా ఎదుట మాట్లాడారు. బీజేపీ 10 ఎండ్ల పాలనలో జీడీపీ అతి తక్కువగా నమోదవుతోందని తెలిపారు. బ్యాక్ బోన్‌లాంటి మ్యానిఫ్యాక్చరింగ్ సెక్టార్‌ను బూస్ట్ చేసే అంశాన్ని బడ్జెట్‌లో విస్మరించారని పేర్కొన్నారు. సీఎల్ఐ స్కీంలను ఎంప్లాయిస్ జనరేట్‌తో అనుసందానం చేస్తే బాగుండేదని అన్నారు. మోడీ గ్యారంటీ ప్రకారం చూస్తే 10 ఏండ్లలో 20 కోట్ల మందికి ఉద్యోగాలు రావల్సిందని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్ర స్థాయికి చేరిందని, ఈ సమస్యను పరిష్కరించడం కోసం ఆర్థిక శాఖ మంత్రి ఫోకస్ చేయాల్సిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ అప్పుల రీ స్ట్రక్చర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోమార్లు ఆర్థిక మంత్రికి విజ్ఞాపన చేసిన విషయాన్ని ఈ సంధర్బంగా గుర్తు చేశారు. తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ పార్టీకి ఎంత మాత్రం ప్రేమ లేదనే విషయం తెటతెల్లమవుతోందని పేర్కొన్నారు. అప్పుల పాలైన తెలంగాణకు కేంద్రం సహాయ సహకారం అందిస్తే ఎంప్లాయిమెంట్, ఇతర రంగాల్లో పెరుగుదల ఉండేదని అన్నారు. యువతకు ఉపాధి కల్పించాల్సిన విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీల్లో విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్ అరవిందరాణి రాష్ట్రస్థాయి ఆంగ్ల ఉపన్యాస పోటీల్లో తృతీయ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న తెలిపారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి మండల స్థాయి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి సాధించిన విద్యార్థి ఎస్ అరవింద రాణికి, గైడ్ టీచర్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు దాముక కమలాకర్‌లకు అనురాగ్ యూనివర్సిటీ హైదరాబాద్ నందు నిన్న సాయంత్రం రాష్ట్ర విద్యా శిక్షణా పరిశోధన సంస(ఎస్‌సీఈఆర్‌టీ) సంస్థ డైరెక్టర్ రమేష్, అనురాగ్ యూనివర్సిటీ డీన్ శ్రీనివాస రావు భద్రాద్రి కొత్తగూడెం డీఈఓ, ఇంగ్లీష్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావుల చేతు మీదులుగా విద్యార్థికి సర్టిఫికెట్, అవార్డు, ప్రైజ్ మనీతో పాటుగా షీల్డ్ అందజేసి విద్యార్థిని శాల్వతో సన్మానించారు.

అడవి పందిపై పెద్దపులి దాడి

నవతెలంగాణ-మంచిర్యాల

బెల్లంపల్లి బుగ్గదేవాలయం అటవీ ప్రాంతంలో అడవి పందిపై పెద్దపులి దాడి కలకలం రేపింది. శనివారం ఓ పత్తి చేనులో కనిపించిన అడవి పందిపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో బుగ్గ రాజరాజేశ్వర దేవస్థానానికి వెళ్లే ప్రధాన దారిలో తోకల మల్లేష్‌కు చెందిన పత్తి చేనులో అడవి పందిపై పెద్దపులి దాడి చేసింది. రెండు రోజులుగా పెద్దపులి అక్కడే సంచరిస్తుంది. పత్తి చేనులోనే పెద్దపులి తిష్ట వేసి ఉండడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనకు ముందు పత్తి చేనులో పనిచేస్తున్న కూలీలకు పెద్దపులి కనిపించడంతో పులిని చూసిన కూలీలు పరిగెత్తారు. అదే సమయంలో అడవిపందిపై పెద్దపులి దాడి చేసినట్టు అధికారులు తెలిపారు. పెద్దపులి దాడి ఘటనతో ఇండ్ల నుంచి బయటకు వెళ్లరాదని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలను ఫారెస్ట్ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. పులి అడుగుజాడలను ఎప్పటికప్పుడు కనిపెడుతున్నామని అది ప్రస్తుతం కాసిపేట వైపు వెలుతున్నట్లు తెలిపారు.

నూతన కమిషనర్‌కు అభినందనలు



నవతెలంగాణ-మందమర్రి

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తుంగపిండి రాజలింగును సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, మున్సిపల్ కార్మిక సంఘం (సీఐటీయూ) నాయకులు, సభ్యులు సంగి పోషం తదితరులు అభినందనలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై అనుచిత వ్యాక్యలు చేస్తే సహించేది లేదని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫసిఉల్లా అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులం పరంగా గాని, మతంపరంగా గాని ఎమ్మెల్యే ఎక్కడ కూడా తప్పుగా మాట్లాడలేదని, అన్ని వర్గాల వారిని సమ న్యాయం చేస్తూ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అనవసరంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎండీ రియాజ్‌ఉద్దీన్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఎంఏ రజాక్, మాజీ ఉపసర్పంచ్లు మోసిన్ షా ఖాన్, ఎండీ అజహర్, సీనియర్ నాయకులు ఎండీ రియాసత్ అలీ, సయ్యద్ రఫీ ఉల్లాహ్, షేక్ ఇమ్రాన్, మౌలానా, గంగన్న యాదవ్, జువ్వడి శీను పాల్గొన్నారు.

విద్య రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

కేంద్ర ప్రభుత్వం విద్య రంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రగతి శిలా ప్రజాసౌమ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీత రామన్ పార్లమెంటులో విద్యారంగానికి కేవలం రూ.1.28 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించడం అనేది పూర్తిగా విద్య వ్యవస్తాను నిర్లక్ష్యం చేయడమే అన్నారు. బడ్జెట్ వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరం అయ్యే పరిస్థితి ఉందని, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి కార్పొరేట్ వ్యవస్థకు వత్తాసు పలికే బడ్జెట్ కేటాయించారని మండి పడ్డారు. విద్యార్థులు కొనుక్కునే పెన్ను, పెన్సిల్‌లపై కూడా జీఎస్టీ వేయడం చాలా దుర్మార్గమని, కేంద్ర ప్రభుత్వం మరోసారి ఆలోచించుకొని విద్య రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్య రంగానికి కేటాయించిన బడ్జెట్‌పై తెలంగాణ ఎంపీలు గొంతు విప్పలని కోరారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

రేషన్ డీలర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-దండేపల్లి

రేషన్ డీలర్ల సంఘం మండల కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మూట పలుకుల సత్తయ్య ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నల్లెల్లి మల్లేష్, ఉపాధ్యక్షుడిగా రాపెల్లి జయంతి, ప్రధాన కార్యదర్శిగా మడావి తుకారంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తూ రేషన్ డీలర్ల సమస్యలపై పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు నక్క తిరుపతి, నలిమెల అశోక్, ఉషన్న, తిరుపతి, సృజన్, చంద్రయ్య, శ్రీను, ప్రభాకర్, రాజా, నర్సింగ్, సురేష్, జాఫర్, లచ్చన్న, సంతోష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | ఫిబ్రవరి 02, 2025 | www.navatelangana.com

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



సోన్ మండలం కూచన్‌పల్లి గ్రామ గోదావరి నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ మల్లేష్ మాట్లాడుతూ స్వర్ణ వాగు, గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. మండలంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కవి ముకుందరావుకు డాక్టరేట్

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని శంకర్ తండ గ్రామానికి చెందిన ఎస్ఏ హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జాధవ్ ముకుంద్ రావు డాక్టరేట్ అవార్డు పొందారు. భాషా పట్ల నిరంతర కృషి, శ్రమిస్తూ హిందీ, తెలుగు భాష అభివృద్ధితో పాటు పద్యం రూపంలో 125 కన్నా ఎక్కువ అముద్రిత స్వీయ రచనలు, వ్యాస రాశారు. 2024 వరకు మూడుసార్లు గౌరవ డాక్టరేట్ అవార్డును సాధించారు. ప్రస్తుతం కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కవి సమ్మేళనంలో హిందీ వ్యాస రచనలో జీవన్ హి సంఘర్ష , మానవత పధన ఏక్ లక్ష్య హై చాలా అంశంపై వ్యాసం రాయడంతో డాక్టరేట్ అవార్డు పొందారు. ఆయనకు అవార్డు రావడంపై బెజ్జూర్ జడ్పీహెచ్ఎస్, పీజీ హెచ్ఎం, ఎంఈఓతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉద్యోగులకు ఊరటనిచ్చే బడ్జెట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సగటు వేతన జీవులకు ఎంతో ఊరట కలిగించేటువంటి అంశమని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, వలభోజు గోపికృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో వార్షిక ఆదాయం ఏడు లక్షలలోపు ఉన్న వారు టాక్స్ మినహాయింపును పొందారన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.12 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారు కూడా ఆదాయపన్ను నుంచి పూర్తి రిబేట్ ప్రకటించడం ఎంతో ఆనందించాల్సిన విషయమన్నారు. గతంలో రూ.12 లక్షల ఆదాయం ఉన్నవారు సుమారుగా రూ.80 వేల టాక్స్ చెల్లించేవాళ్లు కానీ ప్రస్తుత బడ్జెట్‌లో టాక్స్ స్లాబ్ ప్రకారం వారు చెల్లించే టాక్స్ సున్నా అని పేర్కొన్నారు. ఇది సగటు ఉద్యోగులకు, వేతనజీవులకు ఎంతో ఊరట కలిగించే అంశమన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ తరపున కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.

క్రికెటర్‌కు రూ.లక్ష అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కష్టాల్లో ఉన్నవారికి పలువురు మనవతావాదులు తమవంతు అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారు. కష్టకాలంలో బాసటగా నిలిచి మానవతా దృక్పథాన్ని చాటుతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త షమీ ఉల్లాఖాన్ శనివారం షేక్ అజీజ్ అనే వ్యక్తికి చికిత్స కోసం రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. రెండేండ్ల కిందట క్రికెట్ ఆడే సమయంలో జరిగిన ప్రమాదంలో షేక్ అజీజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దాదాపు మూడు నెలల పాటు ఆయన కోమాలో ఉండగా, ఆ సమయంలో షమీ ఉల్లాఖాన్ బాధితుడి ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని రూ.3లక్షల సాయం అందించారు. తాజాగా రూ.లక్ష అందచేసి మానవత్వాన్ని చాటారు.

కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత సృజనాత్మకత జోడించి నూతన ఆవిష్కరణ చేయాలని, నలుగురు విద్యార్థులు సభ్యులు ఉన్న ఒక టీం ఒక ఆవిష్కరణ చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఒక కళాశాల నుంచి ఎన్ని టీమ్‌లు అయినా కార్యక్రమంలో పాల్గొనవచ్చని కార్యక్రమ కోఆర్డినేటర్ ఎండీ అశ్రఫ్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ అరుణ్ కుమార్, రమాకాంత్‌గౌడ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజ్ కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని దన్నూర్(బి) గ్రామానికి చెందిన అబిరెడ్డి నానమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా శనివారం కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, పసుల చంటి, గడ్డల నారాయణ, నాయకులు ఉన్నారు.

విహార యాత్రకు వేదం విద్యార్థులు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని బాగాపూర్ శివారులోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయం మాఘ మాసంలో మొదటి శనివారం కావడంతో వేదం పాఠశాల విద్యార్థులు, టీచర్లు విహారయాత్రగా నారాయణ గుట్టకు వచ్చారు. లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నరసింహస్వామి మాట్లాడారు. విద్యార్థులకు ఆధ్యాత్మికతను అలవాటు చేసుకోవాలని, దేవాలయాల ప్రాముఖ్యతను, వివరించారు. విద్యను శ్రద్ధగా చదవాలన్నారు. అనంతరం వేదం విద్యార్థులు ఆటపాటలతో సందడిగా గడిపి వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రమేష్, ఆలయ అర్చకుడు నరసింహస్వామి, వేదం టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-కడెం



పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అడుగులు వేయాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇస్తరాకు కుటీర పరిశ్రమను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే మోదుగాకుతో ఇస్తరులను తయారు చేయడం అభినందనీయమన్నారు. మహిళలను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని తెలిపారు. అనంతరం ఎల్లగడప గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పొద్దుటూరి సతీష్‌రెడ్డి, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడిగెల భూషణ్, తాళ్లపెల్లి రమేష్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని భీంసరి గ్రామంలోని శ్రీమార్కండేయ మందిరాన్ని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి శనివారం సందర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు అర్చన నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ఆలయ అధ్యక్షులు మాటేటి రాజు, సామల రాజన్న, దాసరి ప్రశాంత్, మెరుగు సాయికృష్ణ, పాకిపొండ్ల రవి, సామల శేఖర్, బత్తుల రాజేష్, భీంసరి ఆలయ సభ్యులు హన్మండ్లు, చిన్న ఈరన్న, నీలం రామన్న, పెద్ద ఈరన్న, ఎలిగెటి నర్సింగ్, మల్లయ్య, సంజయ్, నాయకులు నలిమేల నవీన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్‌రెడ్డి, వెంకటేష్, కుర్ర నరేష్, అనుముల ఉశన్న, ఉదయ్, మల్లయ్య ఉన్నారు.

కుభీర్ : మండల కేంద్రంలో శనివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పద్మశాలి కులస్తులు మార్కండేయ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షుడు గజేందర్ మాట్లాడుతూ పద్మశాలి సంఘం సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పండరి, సభ్యులు దేవిదాస్, భోజన్న, గణేష్, లక్ష్మణ్, సంజు ఉన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో శనివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మార్కండేయ చిత్రపటానికి పూలమాలవేసి కొబ్బరికాయ కొట్టారు. అనంతరం పూజలు నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఆడేపు రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘంలో శనివారం ఘనంగా శివభక్త మార్కండేయ మహర్షి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. తిమ్మాపూర్ సదర్ సంఘం అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేశారు. పట్టుదలకు మారుపేరుగా నిల్చి, తన భక్తితో శివుణ్ణి మెప్పించి, యమధర్మరాజును ప్రసన్నుడిని గావించి మృత్యువుని సైతం గెల్చిన మార్కండేయున్ని ప్రతి పద్మశాలి ఆదర్శంగా తీసుకొని, మంచి ప్రవర్తనతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సదరు సంఘం ప్రధాన కార్యదర్శి ఎనగందుల రమణయ్య, కోశాధికారి రాంభీమేశ్వర్, ఉపాధ్యక్షుడు బింగి అనిల్, నాయకులు నడిమెట్ల రమేష్, వెన్నం అంజయ్య, బింగి సునీల్, వడ్లకొండ భూమన్న, నడిమెట్ల రాజేందర్, వేముల నాగరాజు, రాం చిన్న భీమయ్య, వాల్గొట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నస్పూర్ : పట్టణంలోని శ్రీ లక్ష్మీ గణపతి శివ మార్కండేయ దుర్గామాత దేవాలయంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జెండా ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు శ్రీరాంభట్ల ఆనంద్ శర్మ, శ్రీరాంభట్ల సాత్విక్ శర్మ, శ్రీరాంభట్ల ఆకాష్ శర్మ, దేవరాజు వెంకటరమణల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, రుద్ర హోమం నిర్వహించారు. భక్తుల లలితా సహస్ర నామ పారాయణం, శివ నామ స్మరణతో ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు చిలగాని బొడ్డయ్య, ప్రధాన కార్యదర్శి వేముల సురేష్, కోశాధికారి చిప్ప రాజబాబు, గౌరవ అధ్యక్షుడు మెండె వెంకన్న, మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, దేవాలయ కమిటీ అధ్యక్షుడు సిరిపురం రామన్న, ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్, కోశాధికారి కుందారపు రమేష్, రాష్ట్ర కార్యదర్శి చిలువేరు సదానందం, గుండేటి యోగేశ్వర్, గౌరవ అధ్యక్షుడు పాడేటి శంకరయ్య, ఆడెపు శంకరయ్య, ఉపాధ్యక్షులు దేవసాని నాగరాజు, కుసుమ శంకర్, సట్యూరి రవీందర్, కటకం లక్ష్మణ్, తౌటం మల్లేష్, ఆడేటి రాజయ్య పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అటవీ శాఖ చెక్ పోస్ట్ సమీపంలోని నదితీరం శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పలువురు దంపతులు హోమం నిర్వహించారు. ఆలయం నుండి పట్టణ ప్రధాన వీధుల గుండా శోభయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ఆడారు. మార్కండేయ జయంతి సందర్భంగా చేపట్టిన శోభాయాత్రతో జిల్లా కేంద్రంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శోభాయాత్ర సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు అనుమాండ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి అల్లె శ్రీకాంత్, సంఘం నాయకులు లింగయ్య, బొద్దున చందు, గుండ శంకర్, మోహన్, అజయ్, అంజయ్య, ధర్మయ్య, రమేష్, ప్రణయ్, మోహన్, ప్రకాష్, మహేష్, మధుకర్, భద్రయ్య, శైలేందర్, మహేష్, ప్రకాష్, రవి, సునీత, రేవతి, జయ, సుజాత, క్రాంతి, కీర్తి, రేణుక, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

రెబ్బెన : గోలేటి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగ సమ్మయ్య దంపతులతో పూజా కార్యక్రమాలు చేయించారు. ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఎస్ఓటుజీఎం కన్నం రాజమల్లు దంపతులు హాజరై స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారిన వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి దోమల పోచయ్య కోశాధికారి వనమాల, మురళి, గోలేటి పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గుండేటి వీరస్వామి, ఎలిగేటి ఉపేందర్, బింగి ప్రభాకర్, మోరే సత్యనారాయణ, కోట కృష్ణ పాల్గొన్నారు.



సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణ కేంద్రంలోని సద్గురు సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో బాబా విగ్రహానికి పాలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవానికి తనవంతుగా 40 క్వింటాళ్ల బియ్యం అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయిబాబా "సబ్ కా మాలిక్ ఏక్" అనే నినాదంతో సర్వ మతాల దేవుళ్లు ఒకరేనని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రజలపై సాయిబాబా ఆశీస్సులు ఉండాలని, పాడిపంటలు బాగా పండాలని, ప్రపంచమంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ కలప నిందితులకు రిమాండ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ గ్రామం వద్ద అటవీ అధికారులు అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకొని నిందితులను రిమాండ్‌కి తరలించారు. ఆసిఫాబాద్ అటవీ రేంజ్ అధికారి గోవింద్ సింగ్ సర్దార్, జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు అడ గ్రామం వద్ద అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అటువైపు నుండి ఆసిఫాబాద్ కారులో కలప తరలిస్తున్నారని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18,000 విలువ గల 4 కలప దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. నిందితులు మొహమ్మద్ గౌస్, మొహమ్మద్ ఆఫ్తాబ్ హుస్సేన్, ఆత్రం రాజు, మాడవి మెంగు, ఆత్రం లక్ష్మణ్‌లను సిర్పూర్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. నిందితులను జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌లో రిమాండ్‌కు పంపించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ కులకర్ణి, సెక్షన్ అధికారులు సాయిచరణ్, విజయ్ ప్రకాష్, చంద్రకాంత్, రఘు, బీట్ అధికారులు మారుతీ, స్వప్న, అమరేందర్, సాదిక్, భూమేష్, నాజీర్, రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు నెలల పాపకు సాయం

నవతెలంగాణ-ఉట్నూర్



ఐదు నెల పాపకు పాల కోసం ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా సాయం అందించారు. గత అక్టోబర్‌లో ఐటీడీఏ ప్రజా ఫిర్యాదుల విభాగంలో దరఖాస్తు చేసుకున్న గుడిహత్నూర్‌కు చెందిన కుమారం సుజాత ఐదు నెలల బాబుకు పాలు తీసుకునేందుకు స్తోమత లేక సాయం కోసం ఫిర్యాదు చేశారు. శనివారం పీఓ తన చాంబర్‌లో ఈ మహిళలకు సాయం అందించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గుడిహత్నూర్ అంగన్‌వాడీ ద్వారా ప్రతి నెల బాబు పాల డబ్బాలు అందిస్తామన్నారు. ప్రతి నెల రూ.8825 నగదును ఐటీడీఏ ద్వారా అందుతాయన్నారు. ప్రతి నెల బాబు, తల్లి ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం సుజాత పీఓకు ధన్యవాదలు తెలిపారు.

టీబీజీకేఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నూతన క్యాలెండర్ను ఫిట్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ-3,3ఏ గనిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధికారంలో ఉన్న సమయంలో సింగరేణి ఉద్యోగులకు సాధించిన హక్కులను, సౌకర్యాలను వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ తౌటి నరేష్, సాదుల భాస్కర్, వెంకటరమణరెడ్డి, సతీష్ యాదవ్, జంగ తిరుపతి, శశిధర్, కార్తీక్, చల్లా ప్రశాంత్, గంగాధర్, శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాస్, కిరణ్, రవి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉమర్ షరీఫ్

నవతెలంగాణ-జన్నారం



ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉమర్ షరీఫ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండల ఎంపీడీఓగా విధులు నిర్వహించిన ఠాగూర్ శశికళ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందడంతో ఈఓపీఆర్డీ, హాజీపూర్ ఇన్‌చార్జి ఎంపీఈఓగా విధులు నిర్వహిస్తున్న ఉమర్ శరీఫ్ బాధ్యతలు స్వీకరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, సామాజిక ఉద్యోగ భద్రత కల్పించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్)లో కాంట్రాక్టు కార్మికులు దాదాపుగా 17 మంది చేరారు. వారికి అధ్యక్షుడు కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోతే ఓదెలు, బుర్ర అరుణ్‌గౌడ్, అడిగోప్పల రాజ్ కుమార్, మిట్టపల్లి మొగిలి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలి

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కాలేజీగా అప్ గ్రేడ్ చేయాలని బెల్లంపల్లిలో బస్సు డిపో ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ బెల్లపల్లి పట్ట నాయకులు ఎమ్మెల్యేను కోరారు. శనివారం క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే వినోద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య నాయకులు చిలుముల శంకర్, నాతర స్వామి, చింతపండు శ్రీనివాస్, రోడ్డ శ్యామ్, రాము, మేకల శ్రీనివాస్, మొగురం కన్నయ్య, కల్లూరు మల్లేష్, వినేష్ పాల్గొన్నారు.

కొట్టాల పోచమ్మ విగ్రహా ఆవిష్కరణ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో కొట్టాల పోచమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠపాన కార్యక్రమానంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఏఎంసీ చైర్మెన్ రుక్మాన్ సింగ్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు అక్షరాభ్యాస కార్యక్రమం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వసంత పంచమిని పురస్కరించుకొని ఈ నెల 3న కాగజ్‌నగర్ పట్టణం ద్వారకా నగర్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గణపతి పూజ, సరస్వతి పూజ, హోమం నిర్వహించిన అనంతరం మూడేళ్లు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించనున్నట్టు తెలిపారు.